సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 2 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.22

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.22 పలికింది. కనిష్టం రూ.10, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



విశ్వాస నేస్తం

శునకం.. మనిషికి నేస్తం.. అత్యంత విశ్వాసం చూపే పెంపుడు జంతువు. పల్లెల్లోనూ చౌకగా దొరికే శునకం.. ఇప్పుడు ఖరీదైపోయింది. 8లో

గరిష్టం/కనిష్టం
32.4°/18.6°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది. ఉదయం చలి వాతావరణం కొనసాగింది.

న్యూస్‌రీల్

ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం

- కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ

పుట్టపర్తి అర్బన్: వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఇచ్చిన ఫిర్యాదులను వంద శాతం పరిష్కరిస్తామని కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడలోని ఎన్నికల ప్రధాన కార్యాలయం నుంచి ముసాయిదా ఓటర్ల జాబితా సవరణలో భాగంగా పెండింగ్ ఫారాలు, యువ ఓటర్ల నమోదు, ఓట్ల మార్పులు, చేర్పులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ వర్మవల్ ద్వారా మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి వీసీలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్, పెనుకొండ సబ్‌కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్య తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించడానికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. శని, ఆదివారాల్లో ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ ముసాయిదా ఓటరు జాబితాపై బీఎల్‌ఓలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు భాగ్యరేఖ, వంశీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి ఎన్నికల అధికారులు ఉన్నారు.

అవగాహనతోనే హెచ్‌ఐవీ నియంత్రణ



ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రజలకు అవగాహన కల్పించడంతోనే హెచ్‌ఐవీని నియంత్రించవచ్చని కలెక్టర్ అరుణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ ఎస్వీ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పలువురికి బహుమతులు అందించడం జరిగింది. కార్యక్రమంలో కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి, క్షయ నియంత్రణ అధికారి తిప్పయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కృష్ణయ్య, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు క్రమశిక్షణతో మెలగాలి



పరేడ్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: 'పరేడ్ నిర్వహించడం వల్ల క్రమశిక్షణ మెరుగుపడుతుంది. ప్రతి పోలీస్ క్రమశిక్షణతో మెలగాలి' అని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందికి సూచించారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏ.ఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న పోలీస్ సిబ్బంది పరేడ్ నిర్వహించారు. ఎస్పీ మాధవరెడ్డి పరిశీలించి వారికి సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ఎస్పీ ఆధ్వర్యంలో పోలీస్ దర్బార్ నిర్వహించారు. పోలీసు సిబ్బంది తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.

జోరుగా జీరో బిజినెస్

జిల్లాలో జీరో వ్యాపారం జోరుగా సాగుతోంది. రూ.లక్షల్లో చేస్తున్న లావాదేవీలకు సైతం కొందరు అక్రమార్కులు బిల్లులను తెల్ల కాగితాలపై రాసిస్తూ పన్ను చెల్లించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. అడ్డుకట్ట వేయాల్సిన నిఘా వ్యవస్థ నిద్రపోతుండటం గమనార్హం.

- ధర్మవరంలోని ఓ బంగారు దుకాణంలో పుట్టపర్తికి చెందిన ఓ వ్యక్తి రూ.2.50 లక్షలతో ఆభరణాలు కొనుగోలు చేశాడు. ఫోన్ పే ద్వారా చెల్లింపులకు నిర్వాహకుడు అంగీకరించలేదు. రెండు రోజులు ఆలస్యమైనా పర్లేదు.. కానీ నోట్లు తెచ్చి ఇవ్వండని అడిగాడు. ఇదేంటని కొనుగోలుదారుడు అడిగితే.. 'రోజుకు నీలాంటి వాళ్లు పది మంది వచ్చి డిజిటల్ పేమెంట్లు చేస్తారు. మా బ్యాంకు ఖాతాలో ఎక్కువ నగదు చేరుతుంది. ఫలితంగా పన్ను చెల్లించాల్సి వస్తుంది. నోట్లు ఇస్తే బెటర్' అని సమాధానం ఇచ్చాడు.
- బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి హిందూపురంలోని ఓ దుస్తుల దుకాణంలో రూ.80 వేలతో నాలుగు పట్టుచీరలను కొనుగోలు చేశాడు. ఆన్‌లైన్ పేమెంట్‌కు నిర్వాహకుడు ఒప్పుకోలేదు. సరుకు వెనక్కి ఇచ్చినా పర్లేదు కానీ.. ఆన్‌లైన్ లావాదేవీలు వద్దని తేల్చి చెప్పాడు. దీంతో చేసేది లేక కొనుగోలుదారుడు బయటికి వచ్చి రెండు గంటల తర్వాత నోట్లు ఇచ్చి చీరలు తెచ్చుకున్నాడు. డిజిటల్ పేమెంట్లు ఎందుకొద్దని అడగ్గా.. పన్ను భయం వెంటాడుతోందని చెప్పాడు.



- బిల్లులు లేకుండా రూ.కోట్లలో విక్రయాలు
- కిరాణా నుంచి ఆభరణాల దుకాణం వరకూ అంతే..
- చాపకింద నీరులా 'ప్రైవేటు' దందా
- 'మామూళ్ల' మత్తులో వాణిజ్య పన్నుల శాఖాధికారులు !
- ప్రభుత్వానికి ఏటా రూ.కోట్లలో గండి

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలోని పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి తదితర పట్టణాల్లో షాపింగ్ మాల్స్, దుస్తులు, బంగారం, స్టీలు, సిమెంటు తదితర వ్యాపారాలు జరుగుతున్నాయి. వ్యాపారులు విక్రయించే వస్తువులకు సంబంధించి పన్ను వసూలు కావాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానాన్ని అమలు చేస్తోంది. కానీ కొందరు బడా వ్యాపారులు దాన్ని పట్టించుకోవడం లేదు. టీ కొట్లు, చిల్లర దుకాణాల్లో కూడా డిజిటల్ పేమెంట్స్ ఉన్నాయి. కానీ రూ.లక్షల్లో వ్యాపారం చేసేవాళ్లు మాత్రం ప్రభుత్వానికి పంగనామాలు పెడుతున్నారు. వినియోగదారులకు కనీసం బిల్లులు కూడా ఇవ్వడం లేదని పలు ఫిర్యాదులు ఉన్నాయి.

దుస్తుల దుకాణం నుంచి బంగారు షాపు వరకు...

ఏ దుకాణంలో అయినా బిల్లు ఇస్తే సదరు వస్తువుకు సంబంధించిన జీఎస్టీ ప్రభుత్వానికి వెళ్తుంది. దీన్ని ఎగ్గొట్టేందుకు వ్యాపారులు సరికొత్త పంథాను ఎంచుకుంటున్నారు. వినియోగదారుడు అడిగితే తప్ప రశీదు కూడా ఇవ్వడం లేదు. ఒకవేళ గట్టిగా అడిగితే తెల్ల కాగితంపై రాసిస్తున్నారు. ఇదేంటని అడిగితే ఎస్టిమేట్ బిల్లు అంటూ బుకాయిస్తున్నారు. ఈ తెల్ల కాగితాలపై తీసుకున్న వస్తువుల పేర్లు, దుకాణం పేరు, వ్యాట్ రిజిస్టర్ నంబర్లు కనిపించవు. బిల్లులు ఇస్తే ట్యాక్స్‌తో వస్తువుల ధర పెరుగుతుందని కొనుగోలుదారులకు చెబుతుండటంతో వారు కూడా మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి. ఈ తరహాలో జీరో దందా దుస్తుల దుకాణం నుంచి బంగారు షాపు వరకు కొనసాగుతోంది.

అధికారుల నిఘా లేకనే..

జీఎస్టీ ఏర్పాటు తర్వాత కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు పని లేకుండా పోయింది. జిల్లాలో వ్యాపారాలు ఎలా సాగుతున్నాయి? నిబంధనలు అమలు అవుతున్నాయా? ప్రభుత్వానికి సక్రమంగా పన్ను చెల్లింపులు జరుగుతున్నాయా? లేదా? అనే విషయంపై ఎవరూ దృష్టి సారించలేదు. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు వ్యాపారులు ఇలా జీరో దందాకు తెర లేపారు. రూ.కోట్లలో అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అధిక లాభాపేక్షతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగవేస్తున్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

ఏడాదిలో ఓ వ్యాపారి రూ.40 లక్షల వరకు లావాదేవీలు నిర్వహిస్తే తప్పనిసరిగా వాణిజ్య సేవా పన్నులశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. వ్యాపారాల్లో కేటగిరీల ప్రకారం పన్ను శాతం చెల్లించాల్సి ఉంటుంది. అయితే సంబంధిత శాఖాధికారులు నెలవారీ మామూళ్ల మత్తులో కార్యాలయానికే పరిమితం కావడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా జీరో వ్యాపారం చేస్తున్నారు. ఫలితంగా ప్రభుత్వానికి ప్రతి ఏటా రూ.కోట్లలో ఆదాయానికి గండి పడుతోంది.

తనిఖీలు ముమ్మరం చేస్తాం

డిజిటల్ పేమెంట్స్ తీసుకోవడం తప్పనిసరి కాదు. బిల్లులు లేకుండా ఎలాంటి దందా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అక్రమ వ్యాపారాలు చేస్తూ ప్రభుత్వానికి పన్ను ఎగవేయడం చట్టరీత్యానేరం. వ్యాపార సంస్థలపై తనిఖీలు ముమ్మర చేస్తాం. డీజిల్ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం.

– గోపిచంద్, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, హిందూపురం

జీఎస్టీ పేరుతో దోపిడీ

జీఎస్టీ లావాదేవీలు చూపించే వ్యాపారులు మాత్రమే పన్నులు వసూలు చేయాలి. కానీ జీఎస్టీ అనుమతులు లేని దుకాణాలు జీఎస్టీ పేరుతో వినియోగదారులపై బిల్లులు వేసి సొమ్ము చేసుకుంటున్నాయి. నిబంధనల ప్రకారం రూ.20 లక్షల లోపు వ్యాపారాలు చేసే వారు ఎలాంటి జీఎస్టీ వసూలు చేయకూడదు. పైగా సదరు దుకాణంలో జీఎస్టీ అనుమతి లేని దుకాణం అని బోర్డు ఏర్పాటు చేయాలి. కానీ రూ.కోటి వరకు టర్నోవర్ చేసే దుకాణాల్లోనూ జీఎస్టీ లైసెన్సుల బోర్డులు లేవు. కానీ.. వినియోగదారులపై మాత్రం పన్నులు వేస్తూ ప్రభుత్వానికి మాత్రం చెల్లించడం లేదు.



ఆనందమని'పింఛన్'



ఎనుములపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్ హర్ష

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక అవ్వాతాతల ముఖాల్లో ఆనందాన్ని నింపింది. జిల్లాలో వృద్ధాప్య, వికలాంగ, ఒంటరి మహిళ, వితంతు, డప్పు కళాకారులు, కల్లుగీత కార్మికులు, చేనేత, వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి శుక్రవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు పింఛన్లు అందించారు. జిల్లాలోని 2,72,262 మంది లబ్ధిదారులకు రూ.75,67,09,250 నగదు మంజూరైంది. శుక్రవారం 2,02,447 మందికి రూ.56,24,52,500 నగదు మొత్తాన్ని పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. మరో నాలుగు రోజులు పాటు పింఛన్ పంపిణీ చేస్తామన్నారు. ఒకటో తేదీనే ఠంచన్‌గా పింఛన్ అందడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

జిల్లాకు మరో రెండు విద్యా డివిజన్లు

కదిరి: ప్రతి రెవెన్యూ డివిజన్‌కు ఒక ఉప విద్యాధికారి (డీవైఈఓ) పోస్టు మంజూరైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి దాకా రాష్ట్ర వ్యాప్తంగా 53 విద్యా డివిజన్లు ఉండేవి. ఇకపై వాటి సంఖ్య 74కు పెరగనుంది. ఇందులో భాగంగా జిల్లాలో కూడా ఇప్పటి వరకూ కేవలం రెండు (ధర్మవరం, పెనుకొండ) విద్యా డివిజన్లు మాత్రమే ఉండేవి. ఒక్కో రెవెన్యూ డివిజన్‌కు ఒక విద్యా డివిజన్ ఉండాలన్న ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాకు కొత్తగా కదిరి, పుట్టపర్తి రెవెన్యూ డివిజన్‌లకు కూడా ఒక్కో డీవైఈఓ పోస్టు మంజూరైంది. దీంతో జిల్లాలో ఇకపై నాలుగు విద్యా డివిజన్లు ఉంటాయి.

దొంగ ఓట్ల వెనకున్నది టీడీపీనే..

- 25 వేలకు పైగా ఓట్లు తొలగించాలని ఈఆర్‌ఓను కోరాం
- వాటిని తొలగించడంలో అలసత్వం వహిస్తున్నారు
- బీఎల్‌ఓలను టీడీపీ, ఎల్లో మీడియా బెదిరిస్తోంది
- వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలని చూడటం హేయం
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: 'దొంగ ఓట్లు సమాజానికి హానికరం. ధర్మవరం నియోజకవర్గంలో 25 వేలకు పైగా దొంగ ఓట్ల వివరాలను ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి, ఈఆర్‌ఓకి అందించాము. వాటిని నిర్మూలించడంలో వారు అలసత్వం వహిస్తున్నారు. టీడీపీ, ఎల్లో మీడియా దొంగ ఓట్లపై విచారణ జరపకుండా బీఎల్‌ఓలను బెదిరిస్తూ పబ్బం గడుపుకుంటూ వైఎస్సార్‌సీపీపై బురదజల్లాలని చూస్తున్నారు' అని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ధర్మవరం నియోజకవర్గంలో దొంగ ఓట్లను నిర్మూలించాలని 2019 నుంచి తాము పోరాటం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 25 వేల దొంగ ఓట్లు ఉన్నాయని తమ శ్రేణుల ద్వారా డోర్ టు డోర్ సర్వే జరిపి దొంగ ఓట్లను ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి, ఈఆర్‌ఓకి అందించామని చెప్పారు. ఇందుకు స్పందించిన ఎన్నికల సంఘం తమ సిబ్బందితో విచారణ జరిపి దొంగ ఓట్లు ఉన్నది నిజమేనని తేల్చినట్లు పేర్కొన్నారు. వాటిలో 5 వేలు దాకా డెత్, 10 వేలు పర్మనెంట్ షిఫ్టింగ్, 4 వేల ఓట్లు రెండు ప్రాంతాల్లో ఓటు కల్గి ఉన్నట్లు ఎన్నికల సంఘం నిర్ధారించిందన్నారు. అయితే ఇప్పటికీ ఆ 25 వేల దొంగ ఓట్లను తీసివేయడంలో బీఎల్‌ఓలు తాత్సారం చేస్తున్నారని తెలిపారు. దీనిపై యేదాది నుంచి పలుమార్లు ఈఆర్‌ఓ, జిల్లా కలెక్టర్, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశామన్నారు. ప్రస్తుతం బీఎల్‌ఓలు కొత్త ఓటర్ల నమోదు చేసే ప్రక్రియలో నిబంధనలు పాటించడం లేదన్నారు. కొత్త ఓట్లు ఎక్కించేటప్పుడు డోర్ టు డోర్ సర్వే చేయకుండా గ్యాస్ బిల్, డోర్‌నంబర్ ఆధారంగా ఎక్కించడం వల్ల మరిన్ని దొంగ ఓట్లు చేరే ప్రమాదం ఉందన్నారు. బీఎల్‌ఓలు పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా చేస్తున్న ఒత్తిళ్లకు తలొగ్గి దొంగ ఓట్లను నిర్మూలించకుండా కొత్తగా దొంగ ఓట్లను ఎక్కిస్తే చర్యలు తప్పవన్నారు. ఇటీవల ఎల్లో మీడియాలో పుంఖాను పుంఖానుగా వస్తున్న కథనాలతో బీఎల్‌ఓలను బెదిరిస్తూ దొంగ ఓట్లను కాపాడుకునే ప్రయత్నం టీడీపీ చేస్తోందన్నారు. దొంగ ఓట్లన్నీ టీడీపీ ప్రభుత్వ హయాంలో నమోదు చేసినవి కాబట్టే ఈ మైండ్‌గేమ్ ఆడుతున్నారన్నారు. తాము దొంగ ఓట్లపై ఫిర్యాదు చేస్తే నానాయాగి చేసే ఎల్లో మీడియా... టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ నియోజకవర్గంలో 17 వేల దొంగ ఓట్లు ఉన్నాయని ఈఆర్‌ఓకి ఫిర్యాదు చేస్తే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

పునాదులకు ఓట్లు ఎక్కించిన ఘనత టీడీపీదే

తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నిర్మించిన కేతిరెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వైఎస్సార్ కాలనీల్లో పునాదులకు ఓట్లు ఎక్కించారని ఇటీవల టీడీపీ నాయకులు ఆరోపించారన్నారు. వాస్తవానికి 2019లో పునాదులకు, ఖాళీస్థలాల ప్లాట్ నంబర్లకు ఓట్లు ఎక్కించారని ఆధారాలతో సహా బయటపెట్టింది తానేనన్నారు. అందుకు సంబంధించి గతంలో మీడియా సమావేశంలో చూపించిన ఆధారాలను వెల్లడించారు. పునాదులకు దొంగ ఓట్లు తీసివేసేలా తాము ఎంతో కృషి చేశామని, త్వరలో ఆ దొంగ ఓట్లను నిర్మూలిస్తామన్నారు.

చంద్రబాబు జీవితం మొత్తం ఫేక్..

ఒక పార్టీకి జెండా, అజెండా అనేది ఎంతో ముఖ్యమని ఇవేవి లేకుండా ఊసర వెల్లిలా రంగులు మారుస్తున్న చంద్రబాబు జీవితం మొత్తం ఫేక్ అని విమర్శించారు. రాష్ట్రం విడిపోవడానికి ప్రధాన కారణమైన కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో మద్దతు తెలిపిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఏం సంకేతమిస్తున్నారని ప్రశ్నించారు. మన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపే దమ్ము చంద్రబాబుకు ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో సేవా మిత్ర యాప్‌ను పెట్టిన టీడీపీ ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి ఓటీపీలను అడుగుతూ ఓట్లను తొలగించేందుకు కుట్రపన్నుతోందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు నోటిఫికేషన్

- ఇండస్ట్రియల్, ఎగ్జిక్యూటివ్ కోటాలో పార్ట్ టైం, ఫుల్ టైం పీహెచ్‌డీకి అవకాశం



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో ఇండస్ట్రియల్, ఎగ్జిక్యూటివ్ కోటాలో పార్ట్‌టైం, ఫుల్‌టైం పీహెచ్‌డీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండస్ట్రీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే ఎగ్జిక్యూటివ్, అర్ అండ్ డీ (రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్) సంస్థల్లో పనిచేసే శాస్త్రవేత్తలు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సివిల్ సర్వీసెస్ అధికారులు పీహెచ్‌డీ అడ్మిషన్ పొందవచ్చు. సంబంధిత పీజీలో 55 శాతం మార్కులు లేదా 6.0 సీజీపీఏ సాధించిన వారు అర్హులు. ఇద్దరు గైడ్లు ఉంటారు. పనిచేస్తున్న సంస్థలో ఒక గైడ్, యూనివర్సిటీ తరఫున ఒక గైడ్ ఉంటారు. దరఖాస్తులు సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, కెమికల్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమేటిక్స్, మేనేజ్‌మెంట్, బయోటెక్నాలజీ, ఫార్మాసూటికల్ సైన్సెస్, ఇంగ్లిష్, ఫుడ్ టెక్నాలజీ రంగాల్లో పీహెచ్‌డీ చేయడానికి అవకాశం కల్పించారు. జేఎన్‌టీయూ అనంతపురం కానిస్టిట్యూట్ కళాశాలలే కాకుండా యూనివర్సిటీ గుర్తించిన 14 పరిశోధన కేంద్రాల్లో దేనిలోనైనా పీహెచ్‌డీ చేయవచ్చు. అభ్యర్థులు రూ.1500 డిమాండ్ డ్రాఫ్ట్‌తో దరఖాస్తుకు సంబంధిత సర్టిఫికెట్లను జత చేస్తూ ఈ నెల 16వ తేదీలోపు యూనివర్సిటీకి చేరేటట్లు పంపాలి.

రీసెర్చ్ కేంద్రాలు ఇవే..

జేఎన్‌టీయూ అనంతపురం కానిస్టిట్యూట్ కళాశాలల (జేఎన్‌టీయూ అనంతపురం, కలికిరి, పులివెందుల, ఓటీపీఆర్‌ఐ)తో పాటు 14 పరిశోధన కేంద్రాల్లో అడ్మిషన్లు కల్పిస్తారు. శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాల (నంద్యాల), శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్) (చిత్తూరు), శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (అటానమస్) తిరుపతి, వేము ఇనిస్టిట్యూట్ (పి.కొత్తకోట, చిత్తూరు), శ్రీనివాస మేనేజ్‌మెంట్ స్టడీస్ (చిత్తూరు), శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఫార్మసీ (చిత్తూరు), కేఎస్‌ఆర్‌ఎం (అటానమస్) కడప, శ్రీ పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసీ (తిరుపతి), అన్నమాచార్య (అటానమస్) రాజంపేట, జి.పుల్లారెడ్డి (అటానమస్) కర్నూలు, ఆర్‌జీఎం (అటానమస్) నంద్యాల, రైపర్ అనంతపురం, సెవన్ హిల్స్ ఫార్మసీ తిరుపతి.

అంతరం తగ్గాలి

రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శాస్త్రవేత్తలుగా ఉన్న వారు, ఇండస్ట్రీ అనుభవం ఉన్నవారికి పరిశోధన పట్ల ఆసక్తి ఉంటే పీహెచ్‌డీ చేయడానికి అవకాశం కల్పిస్తాం. దీంతో పరిశ్రమ– కళాశాల మధ్య అంతరం తగ్గి.. బంధం బలపడుతుంది. పరిశ్రమలకు తగ్గట్టుగా పరిశోధన చేయడానికి కళాశాల దోహదపడుతుంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో కళాశాలలో పరిశోధన వాతావరణం మెరుగుపడుతుంది. దీంతో ఇండస్ట్రీలో అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిస్తున్నాం.

– జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం



బ్రాస్‌బ్యాండ్ వాయిస్తున్న నేపాల్ సత్యసాయి యూత్



గోల్డెన్ జూబ్లీ వేడుకలను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు



వేడుకల్లో పాల్గొన్న నేపాల్ సత్యసాయి భక్తులు

ఘనంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ప్రశాంతి నిలయం: సత్యసాయిబాబా తన సేవ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను 50 సంవత్సరాల క్రితం నేపాల్ దేశంలో ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు నేపాల్ నలుమూలలా సత్యసాయి సేవా కార్యక్రమాలు విస్తరించాయి. నేపాల్‌లో సత్యసాయి సేవలు ప్రారంభమై 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ దేశ సత్యసాయి భక్తులు పుట్టపర్తికి చేరుకుని ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధి చెంత గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను జరగనున్నాయి. శుక్రవారం ఉదయం వేదపఠనంతో పూర్ణకుంభం చేతబట్టి నేపాలీ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా సాయికుల్వంత్ సభా మందిరానికి భక్తులు ర్యాలీగా విచ్చేశారు. సత్యసాయి మహా సమాధి చెంత నేపాల్ భక్తుల వేదపఠనంతో వేడుకలు ప్రారంభించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, జోన్ –4 చైర్మన్ అమర్ కార్కిలతో కలసి జ్యోతి ప్రజ్వలను చేశారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్–4 చైర్మన్ అమర్ కార్కి మాట్లాడుతూ నేపాల్‌లో ఒక చిన్న యూనిట్‌గా ప్రారంభమైన సత్యసాయి సేవలు నేడు వేలాది భక్తులతో ఒక పెద్ద దళంగా ఏర్పడిందన్నారు. ప్రకృతి విపత్తు సమయంలో ప్రభుత్వ యంత్రాంగం కంటే సత్యసాయి సేవాదళ్ సభ్యులే ముందుగా అక్కడికి చేరుకుని సేవలు అందిస్తున్నారన్నారు. బాలవికాస్ చిన్నారులు గణపతి వందనం పేరుతో చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

ప్రణాళికలు సిద్ధం చేయండి



మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్. చిత్రంలో కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ఎంపీ లాడ్స్ నిధుల వినియోగానికి సంబంధించి సరైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీ గోరంట్ల మాధవ్, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ , పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని ఎంపీ, దిశ చైర్మన్ గోరంట్ల మాధవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవ్ మాట్లాడుతూ హిందూపురం పార్లమెంట్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల ప్రజలకు శ్మశాన వాటికలు, సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇందులో జిల్లాను అగ్రస్థానంలో నిలబెట్టడానికి అందరూ కృషి చేయాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని తండాల్లో తాగునీటి సౌకర్యం, రోడ్డు వసతి, శ్మశాన వాటికల అభివృద్ధికి ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేస్తామన్నారు. ఏఏ మౌలిక వసతులకు ఎంత నిధులు అవసరమో గుర్తించి నివేదికలు అందజేయాలన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ కింద జిల్లాలో 232 పనులు గుర్తించామన్నారు. ఇప్పటికే 140 పనులకు రూ.10.40 కోట్లు ఖర్చు చేశామనని తెలిపారు. ఇందులో 82 పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయన్నారు. పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు ఉన్నాయని, పనులను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, డిఈలు ఏఈలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్



వెంకటేశ్వరప్రసాద్

కదిరి: కాపునాడు (కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల ఐక్య సంఘటన) శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడిగా కదిరికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాదిండ్ల వెంకటేశ్వర ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు జి.వీరాంజనేయులు శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. నూతన జిల్లా అధ్యక్షుడి నేతృత్వంలో త్వరలోనే జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ, మండల కమిటీల నియామకం ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనను కాపునాడు జిల్లా అధ్యక్షుడిగా నియమించడంపై రాష్ట్ర అధ్యక్షుడికి వెంకటేశ్వరప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

సెంట్రల్ వర్సిటీలో సంస్కృత విద్య శిక్షణ కేంద్రం



అభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తున్న ప్రొఫెసర్లు

అనంతపురం: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీలో కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం వారి అనౌపచారిక సంస్కృత విద్యా శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథి ఎస్వీ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీపీఎస్ రాజేంద్ర ప్రసాద్ సంస్కృత భాషలో ఉన్న వేదాంత శాస్త్రం, రాజనీతి శాస్త్రం, ఆర్థిక శాస్త్రం ప్రత్యేకతను విశదీకరించారు. ప్రొఫెసర్ విశాల్ ప్రసాద్ భట్, సంస్కృత భారతి ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జే.కుమార్ చంద్రశేఖర్ తదితరులు అనౌపచారిక అధ్యయన కేంద్రం గురించి తెలియజేశారు.

‘ఆపస్’ జిల్లా మహిళా కన్వీనర్‌గా మంజుశ్రీ



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) మహిళా విభాగం జిల్లా కన్వీనర్‌గా విడపనకల్లు మండలం హావలిగి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని బి.మంజుశ్రీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంజుశ్రీకి ఆపస్ కమిటీ అభినందనలు తెలిపింది.

ఇంటి ‘పెట్’న విశ్వాస నేస్తం

శునకం.. మనిషికి నేస్తం.. అత్యంత విశ్వాసం చూపే పెంపుడు జంతువు. పల్లెల్లోనూ చౌకగా దొరికే శునకం.. ఇప్పుడు ఖరీదైపోయింది.. ఇంటి పట్టున కాపలాగా ఉండాల్సిన కుక్క.. పోలీసుల రక్షణ విధుల్లోనే కాదు.. రక్షణ దళంలోనూ తప్పనిసరిగా ఉంటోంది. జపాన్, జర్మనీ, డెన్మార్క్ వంటి దేశాల నుంచి అత్యంత ఖరీదైన శునకాలు పల్లెలకూ వస్తున్నాయి. కుటుంబ సభ్యులకు విశ్వాసంతో పాటు రక్షణగా నిలుస్తుండడంతో కొంత స్థోమత కలిగిన ఇళ్లలో ఇవి కనిపిస్తున్నాయి.



విన్యాసం చేస్తున్న పోలీసు జాగిలం



పోలీస్ శిక్షణ పొంది జిల్లాకు వచ్చిన తార, విక్రం

విశ్వాసానికి మారుపేరు శునకం

- దేశ రక్షణలోనూ జాగిలం వినియోగం
- పల్లెలకూ దిగుమతి అవుతున్న విదేశీ శునకాలు
- ఒక్కో జాగిలం ధర రూ.25 వేల నుంచి రూ. లక్ష

పుట్టపర్తి అర్బన్: చిన్న పిల్లల నుంచి ఏడాది వయసున్న శునకాలను కొనుగోలు చేసి ఇంటిలో పెంచుకుంటున్నారు. వీటి ధర రూ.25 వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతున్నాయి. వీటి కొనుగోలు కంటే పెంపకం చాలా ఖరీదైంది. కుక్కలను సాధారణంగా వేటకు, ఇంటి సంరక్షణకు, గొర్రెలు, మేకల కాపలాకు వినియోగించుకునేవారు. నేడు పోలీస్ వ్యవస్థలో అత్యంత కీలకంగా మారింది. ఎక్కడ భారీ దొంగ తనాలు జరిగినా, పేలుడు పదార్థాలు కనిపెట్టాలన్నా, డ్రగ్స్ వంటి చట్ట విరుద్ధంగా ఉన్న వస్తువులను కనిపెట్టాలన్నా, వీటిని వినియోగిస్తున్నారు. ఇవి మనిషితో సుమారు 14 వేల ఏళ్ల నుంచి విశ్వాసం చూపుతున్నట్లు పలు పరిశోధనల్లో గుర్తించారు. ఇందుకు గాను అంతర్జాతీయ కుక్కల దినోత్సవంగా ఆగస్టు 23న నిర్వహించడం ఆనవాయితీ. ప్రపంచంలో లేని విధంగా భారత దేశంలోని వారణాశిలో కుక్క కోసం కాళభైరవుడు అనే పేరుతో ఆలయాన్ని నిర్మించి పూజిస్తున్నారు. కుక్కలపై ఎన్నో తెలుగు సినిమాలు చిత్రీకరించి వాటి ప్రతిభను, బలాన్ని చూపెట్టారు. వీటి జీవిత కాలం 10– 13 ఏళ్లు ఉంటుంది.

జాగిలాలు పలు రకాలు..

అత్యంత విశ్వాసం చూపే జాగిలాలు పలు రకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనవి డాబర్‌మెన్, గోల్డన్ రిట్రీవర్, డాల్‌మేషియన్, పిట్ బుల్, చువావా, బుల్‌డాగ్, రాట్ వీలర్, బాక్సర్, అమర్నాథ్ తదితర రకాలు ఉన్నాయి. ఈ జాతి కుక్కల్లో విశ్వాసంతో పాటు మేధస్సు, శక్తివంతంగా ఉండడంతో వీటిని అత్యధికంగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం చాలా ఇళ్లలో సీసీ కెమెరాల కన్నా అధికంగా వినియోగిస్తున్నారు. దొంగల కదలికలను ఇట్టే పసిగట్టి చిక్కితే చీల్చి చెండాడే గుణం ఉంటుంది. దీంతోనే పోలీసులతో పాటు భారత సైన్యంలో సైతం జాగిలాను వినియోగిస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో పోలీస్ రక్షణకు తారా, విక్రం అనే జాగిలాలను వినియోగిస్తున్నారు. దేశ సైన్యంలో ఉపయోగించే వాటిలో జర్మన్ షెప్పర్డ్, గ్రేట్ స్విస్ మౌంటెన్ డాగ్, లాబ్రడార్, ముథోల్ హ్యాండ్, బఖర్వాల్, బెల్జియం మలినోయాస్, విజ్లా డాగ్ వంటి రకాలను వినిగిస్తున్నారు.

ఆహారం చాలా ముఖ్యం..

సాధారణంగా ఇళ్లలో పెంచుకున్నా పోలీస్ శాఖలో వినియోగిస్తున్నా పలు రకాల జాతి శునకాలకు అందించే ఆహారం ఎంతో ముఖ్యం. ఒక మనిషికంటే ఎక్కువ ఖర్చు అవుతుండడంతో స్థోమత కలిగిన ఇళ్లలోనే వీటిని పెంచుకుంటున్నారు. వీటికి పోషకాలు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్‌లు, కొవ్వులు, విటమిన్‌లు ఉన్న ఆహారాన్ని రోజూ అందించాలి. ముఖ్యంగా చేపలు, చికెన్ వంటకాలను అందిస్తారు. బ్రౌన్ రైస్, ఓట్స్‌ను అందిస్తారు. వీటి కోసం హెన్‌లో, ఒరిజెన్, పీడీయాగ్రీ,బ్రూనోస్ వంటి కంపెనీలు ఆహారాన్ని తయారు చేసి మార్కెట్‌లలో అమ్ముతున్నారు. చాలా కుటుంబాల్లో చికెన్ మటన్ కంటే కూరగాయలు, పాలు, గుడ్లు, రైస్ అత్యధికంగా అందజేస్తున్నారు.

వీటికి వచ్చే వ్యాధులు..

శునకాలకు సాధారణంగా రేబిస్ వ్యాధి అత్యంత ప్రమాదకరం. గతంలో కుక్కల నుండి మనుషులకు సోకి చనిపోయిన సంఘటనలు ఉన్నా. వీటి కోసం టీకాలు రావడంతో రేబిస్ ఉధృతి బాగా తగ్గిపోయింది. ప్రభుత్వం జూనోసిస్ డే పేరుతో ఏటా జూన్ చివరి వారంలో ఉచితంగా టీకాలు అందజేస్తుంది. ఇక సంక్రమణ కాలమైన వర్షాకాలం, మే మాసాల్లో వీటికి కెనైన్ పార్వో వైరస్, కెనైన్ డిస్టింపర్ వంటి వ్యాధులు వస్తాయి. వీటికి టీకాలు అందుబాటులో ఉన్నాయి. ముందు జాగ్రత్తలు చాలా ముఖ్యం. ముఖ్యంగా 6 నుంచి 8 నెలల వయసున్న పిల్లల్లో వచ్చే ఈ వ్యాధికి ఒక్కో టీకా రూ.500 పైగా ధర పలుకుతోంది.

రిజిష్టర్డ్ సంస్థల్లోనే కొనుగోలు చేయాలి..

సాధారణంగా కుక్కలను పెంచుకునే వారు రిజిష్టర్డ్ సంస్థల్లోనే కుక్క పిల్లలను కొనుగోలు చేయాలి. అక్కడ ప్రత్యేకమైన బ్రీడ్ పిల్లలు దొరుకుతాయి. ఆరోగ్యంగా జన్మించి ఉంటాయి. కర్ణాటక లోని బెంగళూరు, తమిళనాడులోని చెన్నైలో రీసెర్చ్ కేంద్రాలు ఉండడంతో కొన్ని జాతుల కుక్కలు అంతరించి పోకుండా ఉచితంగా పిల్లలను అందజేస్తున్నారు. మన ప్రాంతంలో అధికంగా రాంపురా, ముథోల్ (కర్ణాటక), రాజపాల్యం (తమిళనాడు), పందికూన (ప్రకాశం) రకాలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

ఇంటి సభ్యుడే..



ఈ జాగిలం జర్మన్ షెపర్డ్ జాతి రకం. చిన్న పిల్లగా ఇంటికి తీసుకొచ్చినప్పటి నుంచి జాగిలం మాకు ఓ కుటుంబ సభ్యుడి లెక్క. ఈ శునకాలు చూపే విశ్వాసం ఇతర ఏ జంతువులోనూ ఉండదు. మనుషులు తినే ఆహారాన్నే అందజేస్తాం. దీని బర్త్‌డేలు కూడా జరుపుతాం. బెంగళూరులోని కెనస్ సంస్థ నుంచి రూ.25 వేలు వెచ్చించి తీసుకొచ్చాం. రాత్రిళ్లు ఇంటి సంరక్షణకు ఎంతో ఉపయోగకరం. సీసీ కెమెరా కంటే బాగా పని చేస్తుంది. మొదటి సారి తెచ్చిన శునకం చనిపోగా మూడేళ్ల క్రితం చిన్న పిల్లను తీసుకొచ్చి సంరక్షిస్తున్నాం. జాగిలాల పెంపకం వ్యసనంగా మారింది.

– ఏపీ రమణారెడ్డి, ఉషారాణి దంపతులు, పెదపల్లి, పుట్టపర్తి మండలం

రక్షణతో పాటు ఆదాయం తెచ్చి పెడుతోంది



మా ఇంటికి రక్షణ కోసం బెంగళూరు నుంచి రూ.20 వేలు వెచ్చించి తీసుకొచ్చా. దీంతో పది నిమిషాలు ఉంటే అలసట తగ్గి సంతోషాన్ని ఇస్తుంది. గోల్డెన్ రిట్రీవర్ జాతి శునకం 4 ఏళ్ల క్రితం తీసుకొచ్చాం. ఆడ కుక్క కావడంతో దీని సంపర్కం కోసం బెంగళూరు తీసుకెళ్తాం. ఇది రెండేళ్లలో రెండు ఈతలకు 20 పిల్లలను ఇచ్చింది. వీటితో సుమారు రూ.3 లక్షల ఆదాయం వచ్చింది. దీన్ని మహాలక్ష్మిగా పెంచుకుంటున్నాం. ఇంటిల్లిపాదికీ చాలా ఇష్టం. ప్రస్తుతం ఈ శునకం లేకుంటే ఉండలేని పరిస్థితి.

– శివకుమార్, యూట్యూబర్, పుట్టపర్తి

రిజిష్టర్డ్ సంస్థల్లోనే కొనుగోలు చేయాలి



సాధారణంగా కుక్కలను పెంచుకునే వారు రిజిష్టర్డ్ సంస్థల్లో కొనుగోలు చేయడంతో నాణ్యమైన ఆరోగ్యవంతమైన కుక్క పిల్లలు దొరుకుతాయి. వీటిలో విశ్వాసం ఎక్కువగా ఉండడంతో చాలా ఇళ్లలో పెంచుకుంటున్నారు. జిల్లాలో 32 వేలకు పైగా వీధికుక్కలు, పెంపుడు కుక్కలు ఉన్నాయి. జూన్‌లో టీకాలు పంపిణీ కార్యక్రమం చేపడతాం. ప్రతి కుక్కకూ టీకా వేయించుకోవాలి.

– శుభదాస్, జిల్లా పశువైద్యాధికారి

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య



రంగమ్మ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రంగమ్మ (57) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. ఇందిరమ్మకాలనీకి చెందిన కృష్ణయ్య భార్య రంగమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. రంగమ్మ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చూపించుకొని వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి, గురువారం బయటకు వెళ్లింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. పోలీసులు రంగమ్మ మృతదేహం ఫొటోను వాట్సాప్‌లో శుక్రవారం పంపారు. కుటుంబ సభ్యులు చెరువు వద్దకు చేరుకుని రంగమ్మను గుర్తుపట్టారు. అనంతరం మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేత్రదానంతో మరొకరి జీవితాల్లో వెలుగు





నేత్రాలను అందిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు, కేతా వెంకటేష్ (ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని చంద్రబాబునగర్‌లో శుక్రవారం కేతా వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందడంతో విశ్వదీప సేవా సంఘం సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి నేత్రదానం చేసేందుకు ఒప్పించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, టెక్నీషియన్ నాగరాజులు వచ్చి నేత్రాలను సేకరించారు. నేత్రదానానికి సహకరించిన దాత కుమారులు గణేష్, విజయ్, కోడళ్లు సుగుణ, నిర్మల, కుమార్తె వరలక్ష్మి, అల్లుడు సుబ్రమణ్యంలకు విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపకుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: నకిలీ స్టాంపులు, అధికారుల ఫోర్జరీ సంతకాలతో నిందితులకు బెయిల్ ఇప్పించేందుకు యత్నించిన కేసులో పరారీలో ఉన్న ఎస్.భాస్కర్‌ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. వివరాలు.. నల్లచెరువు మండలం తిరుమల దేవరపల్లికి చెందిన వెంకటశివ, కుటాగుళ్ల బావయ్యకు బెయిల్ ఇప్పించేందుకు నకిలీ పత్రాలు, స్టాంపు సీళ్లు వినియోగించి, అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసిన కేసులో భాస్కర్ ప్రధాన నిందితుడు. దీనిపై కదిరి అడిషనల్ జ్యుడీషియల్ ఫస్టు క్లాసు మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. పట్టణంలోని మదనపల్లి రోడ్డులో నాగిరెడ్డిపల్లి పెట్రోల్ బంక్ వద్ద ఉండగా, అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న 14 నకిలీ సీళ్లు, ఇంకు ప్యాడు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించింది. నిందితుడిని కదిరి సబ్ జైలుకు తరలించారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

తాడిపత్రి: మండలంలోని చిన్న పొడమల గ్రామ శివారులో పేకాటాడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ శుక్రవారం తెలిపారు. వారి నుంచి రూ. 1,05,350 నగదు, 4 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

భద్రత చర్యలు వేగవంతం చేయాలి

- డీఆర్ఎం మనీష్ అగర్వాల్



డీఆర్ఎం మనీష్ అగర్వాల్

గుంతకల్లు: మిచాంగ్ సైక్లోనిక్ తుఫాన్ ప్రభావం దృష్ట్యా రైలు కార్యకలాపాలకు భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని జోనల్ అధికారులు ఆదేశించినట్లు డీఆర్ఎం మనీష్ అగర్వాల్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలో తుఫాన్ పరిస్థితిలను ఎదుర్కొనేందుకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని సూచించారు. అందుకు అవసరమైన సామగ్రి అందుబాటు ఉంచుకోవడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. తుఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ అందుకు తగ్గ చర్యలకు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. దీనికి అదనంగా ఇబ్బందికరమైన బ్రిడ్జిల వద్ద వాచ్‌మన్ల నియమించాలని, నిలిచిపోయిన వరద నీటిని పంపింగ్ చేయడానికి డీజిల్ పంపులను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తుఫాను పరిస్థితులతో ఏపీ, తమిళనాడులోని దక్షిణ కోస్తా ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా రైలు సర్వీసులు రాకపోకలు విషయంలో మార్పు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటి పరిస్థితికనుగుణంగా దారి మళ్లించడం, రీషెడ్యూలు చేయడం, లేదా పాక్షికంగా రద్దు చేయనున్నట్లు తెలిపారు. రైలు ప్రయాణికులు తమ రైలు ప్రయాణాలను అందుకనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని తెలియజేశారు. వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాడానికి సమీపంలోని రైల్వేస్టేషన్లులోని అధికారులను సంప్రదించాలని సూచించారు.

కృత్రిమ అవయవాలకు నమోదు చేసుకోండి

అనంతపురం కల్చరల్: భారత వికాస పరిషత్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అందిస్తున్నట్లు నిర్వాహకులు పరుచూరు రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. దురదృష్టవశాత్తూ ప్రమాదాల్లో అవయవాలు పోగొట్టుకున్నవారికి నాణ్యమైన కృత్రిమ కాళ్లు, కాలిఫర్స్ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 9లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు శ్రీనివాస క్లాత్ స్టోర్స్, రఘువీర టవర్స్ పక్కన, సుభాష్‌రోడ్డు, అనంతపురం చిరునామాలో సంప్రదించాలన్నారు. వివరాలకు సెల్: 9849508904, 9492583346 నంబర్లలో సంప్రదించాలన్నారు.

12 మందిపై కేసు నమోదు

కదిరి టౌన్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అనుమతి లేకుండా గుంత తవ్వి, నిర్మాణం చేపట్టిన విషయంలో 12 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. జాతీయ రహదారిలో దిమ్మె నిర్మించి, విగ్రహాన్ని ఏర్పాటు చేస్తుండడంతో రహదారులు, భవనాల శాఖ వర్క్ఇన్‌స్పెక్టర్ దేవానంద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పట్టణానికి చెందిన మగ్బూల్ బాషా అతని అనుచరులు రమేష్ బాబు, శ్రీనివాసులు, చింతా శీను, జనార్దన్, ట్రావెల్స్ రవి, పూలమండీ ప్రసాద్,ఆచారి ఆది, ట్రాక్టర్ శీను, బైసెట్టి సిద్దయ్య, ఫ్యాన్సీస్టోర్ రవి, మరికొందరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

జనవాక్కు

జీవితాలు మెరుగుపడ్డాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొంది, జీవితాలు మెరుగుపరుచుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక విడతలవారీగా అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన కింద రూ.2.23 లక్షలు, వసతి దీవెన కింద రూ. 30 వేలు, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.18 వేలు లబ్ధి పొందాం. తలదాచుకోను గూడులేని మాకు జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేసి, ఇల్లు మంజూరు చేశారు. పేదల మేలు కోరే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పదికాలాల పాటు కొనసాగాలి.

– సి.నాగలక్ష్మి, కల్లూరు, లేపాక్షి మండలం

జగనన్న రుణం తీర్చుకోలేనిది



మాది మధ్య తరగతి కుటుంబం. వెంకటేశ్వర మహిళా స్వయం సహాయక సంఘం సభ్యురాలిని. వైఎస్ జగన్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విడతల వారీగా డ్వాక్రా రుణాలు మాఫీ అవుతోంది. దీంతో మళ్లీ కొత్తగా సంఘంలో మరింత రుణం తీసుకొని, పాడి ఆవు కొనుగోలు చేశా. పాడి ద్వారా వచ్చే ఆదాయం కుటుంబ జీవనానికి సరిపోగా,.. జగనన్న విద్యాదీవెన ద్వారా వచ్చే నగదు పిల్లలు చదువుకు ఉపయోగపడుతోంది. దీంతో పిల్లలు ఇద్దరూ చిన్నపాటి ఉద్యోగాలు చేస్తూ కుటుంబ పోషణకు చేదోడుగా ఉంటున్నారు. జగనన్న గత ఎన్నికలప్పుడు ఇచ్చిన మాట మేరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో అందించడంతో పిల్లల చదువుకు ఉపయోగపడింది. జగనన్న రుణం ఎప్పటికీ మరిచిపోలేం.

– రత్నమ్మ, వెంకటేశ్వర మహిళా సంఘం సభ్యురాలు, మరువకొత్తపల్లి, చిలమత్తూరు మండలం.

ఉచితంగా సర్టిఫికెట్ ఇచ్చారు



జగనన్న సురక్ష ద్వారా నాకు ఉచితంగా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. గతంలో ఈ సర్టిఫికెట్ల కోసం డబ్బులిచ్చి, దరఖాస్తు చేసుకున్నా నెల 15 నుంచి 20 రోజుల వరకూ వచ్చేవి కావు. దీంతో పాటు కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ముఖ్యమంత్రి జగన్ ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష ద్వారా తమ ఇంటి వద్దకు వలంటీర్ వచ్చి సమాచారం ఇచ్చారు. దీంతో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే ఉచితంగా మంజూరు చేశారు. జగనన్న విద్యాదీవెన నాకు వస్తోంది. చదువుకోసం జగనన్న చేస్తున్న మేలు మరువలేనిది. జగనన్నకు కృతజ్ఞతలు.

– జరీనా, విద్యార్థి, అమరాపురం

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు



రాష్ట్ర ప్రభుత్వం నాడు - నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చింది. విద్యార్థులకు బల్లలు, ఫ్యాన్ల సౌకర్యం కల్పించారు. మధ్యాహ్న సమయంలో జగనన్న గోరుముద్ద పథకం కింద నాణ్యమైన భోజనం అందిస్తున్నారు. రాగిజావ కూడా ఇస్తుండడంతో విద్యార్థుల సంఖ్య గతంలో కంటే గణనీయంగా పెరిగింది. మంచి పథకాలను ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టడంతో ప్రజలు అధిక సంఖ్యలో ప్రభుత్వ బడుల్లో చేరుస్తున్నారు. ఉపాధ్యాయులందరం ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్య గురించి చైతన్యం కల్పిస్తున్నాం. భవిషత్‌లో మరింత సంఖ్య పెరుగుతోంది.

– రామసుబ్బయ్య, ఉపాధ్యాయుడు, ఆదర్శ పాఠశాల, అమరాపురం

రైలు కింద పడి వ్యక్తి మృతి

కదిరి టౌన్: పట్టణంలోని నిజాంవలి సమీపంలో డేరంగుల రాము (46) రైలు కింద పడి శుక్రవారం మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. నిజాంవలీ కాలనీకి చెందిన డేరంగుల రాము బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. పూనే నుంచి తమిళనాడుకు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలును గమనించకుండా ట్రాక్ దాటుతుండగా రైలును ఢీకొనింది. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చెరువులో మునిగి బాలుడి మృతి



జనార్దన్ మృతదేహం

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డికి చెందిన గవ్వల జనార్దన్ (6) శుక్రవారం చెరువులో మునిగి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు.. గవ్వల కాశీరావు, పెద్దక్క దంపతుల కుమారుడు జనార్దన్.. గ్రామ శివారులోని చేపల చెరువులో తన పెదనాన్న కిష్టప్ప వల కట్టడాని చూసేందుకు మరో బాలుడితో కలిసి వెళ్లాడు. వారిని చూసిన కిష్టప్ప ఇంటికి పంపాడు. అయితే ఇద్దరు పిల్లలు వేరే దారిలో మళ్లీ చెరువు దగ్గరకు వెళ్లారు. చేపల వల చూస్తూ జనార్దన్ ప్రమాదవశాత్తూ చెరువులో పడి మునిగిపోయాడు. ఈ విషయాన్ని పక్కనే ఉన్న మరో బాలుడు పరుగున గ్రామంలోకి వెళ్లి విషయం తల్లిదండ్రులకు చెప్పాడు. బాలుడి తండ్రి స్థానికులతో కలిసి చెరువు వద్దకు చేరుకుని నీటిలో గాలించారు. నీటిలో చిక్కుకున్న బాలుడిని బయటకు తీసుకొచ్చి, ఆటోలో గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి తండ్రి ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.